# శ్రీ కామేశ్వరీ దేవతా దండకము

శ్రీ మన్మహాదేవి కామేశ్వరీ । సర్వలోకేశ్వరీ । రాజరాజేశ్వరీ । పరమేశ్వరీ । ఈశ్వరీ । మహేశ్వరీ । శాంకరీ । సర్వలోక రక్షాకరీ । నీ నామధేయుండ నీ చరణ దాసుండ । భవ ద్దివ్యపాదాబ్జముల్గొల్చి సేవించి సంస్తుతింప నూహించితిన్ । కృపా దృష్టి వీక్షించి – ప్రసన్న వదనముతో – దయారసము నా పైన ప్రోక్షించి – రక్షింపుమో తల్లీ । భవానీ । శివానీ । రుద్రాణి । శర్వాణీ । కాత్యాయనీ । సహస్ర కోటి భాను ప్రభాదివ్యతేజంబుతో – దేదీప్యమాన నవరత్న ఖచిత మకుటంబుతో – రత్నకంకణ కింకిణి మణి నినదంబుతో కేయూర హారంబుతో – అష్టభుజంబులన్ ఆయుధ ధారివై – చిద్విలాసంబుతో – దివ్యమంగళ స్వరూపంబుతో – భాసిల్లు కామేశ్వరీ । జగన్మాతవై – సహస్ర నామంబులన్ – భిన్నరూపంబులన్ – దివ్యతేజంబులన్ – శోభిల్లు – జగన్మోహినీ । బ్రహ్మ విష్ణు సురేంద్రాదులున్ – నీయడుగు దమ్ముల్గొల్చి – సేవింతురంబా। భైరవీ । సావిత్రీ । గాయత్రీ । భగవతీ। నీమూర్తి – నీకీర్తి – వర్ణింప – నేనెంత । నన్నేలు కృపా సాగరీ । పరబ్రహ్మ స్వరూపిణీ । సకల భువనంబులన్నిండి – వ్యాపించి – నిమిత్త మాత్రంబుగా – హరిహర బ్రహ్మాదులన్ – రక్షింప – వధింప – సృజింప – వేర్వేరు నియమించి – పాలింతు వమ్మా । శాంభవీ । సంగీతగాన వినోదినీ । మృదంగాది వాద్య సమ్మోదినీ । సకలజన పదంబులన్ – దుర్గాంబవీవంచు – శ్యామాంబ

Sri Mahakameswari Seva Trust

వీవంచు – కామాక్షి – మీనాక్షి విశాలాక్షి వీవంచు – మహాశక్తి యన్భావంబునన్ – సమస్తంబునీవంచు – నిన్గొలుతురమ్మా। కామేశ్వరమ్మా। ఆదిశక్తి। హైమవతీ। లలితా। ఉమా। గౌరీ। భక్తి ప్రపత్తితో మేమిచ్చు ధూపదీపనైవేద్యముల్ – ఉపాహారంబులంగొంచు – మా పూజ – మాసేవలెన్మెచ్చి – మా కోర్కె లీడేర్చవో। దాక్షాయణీ। చండికా। కాళికా। చాముండికా । ధూమ్రాక్ష మూక మహిషా సురాదులంజంపి – నీ పరాక్రమంబున్ – ప్రదర్శింపవో – లోకములో । ఆరామవాసితుల, ఆరామద్రావిడుల ఆకుండి వంశంబులన్ బ్రోవగా – మున్నూరాబ్దంబులన్వెనుక – చౌదంతివలస గ్రామంబులో దక్షిణ దిగ్భాగంబునన్ – తూగుటుయ్యలలో సప్తమాతృల సహితంబుగా వెలసి – మా యిలవేల్పువైచెన్నొందు కామేశ్వరమ్మా। స్వదోషంబు సైరించి – నేరంబు మన్నించి – సకల సంపత్తులన్ – ఆయురారోగ్య ఐశ్వర్యముల్ – ప్రసాదించి నన్గాచి – రక్షించుతల్లీ। అజ్ఞానముంబాపి – సుజ్ఞానమునిచ్చి – సద్గతింజూపించు మమ్మా। కామేశ్వరమ్మా। ఇవియె – నా నమస్కృతుల్గొమ్ము దేవీ కామేశ్వరీ – నమస్తే నమస్తే। నమస్తే నమః ॥

పార్వతీపురం

రచన

**కీ॥శే॥ ఆకుండి కామేశ్వరరావు**

*(వీరి కుమారుల సౌజన్యముతో ప్రచురింపబడినది.)*

Sri Maha Kameswari Seva Trust